తిరుపతి - చిత్తూరు

వెంకన్న సేవలో మారిషస్ ప్రధాని

తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం మహద్భాగ్యమని, తనకెంతో అను భూతికలిగించిందని మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్ర రాంగుళం, వీణా రాంగుళం తెలిపారు. సోమవారం సాయంత్రం తిరుమలకు చేరు కున్న మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగుళం, వీణా రాంగుళం దంపతులు సాయంత్రం నైవేద్యవిరామసమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి రాంనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

మాదకద్రవ్యాలు కట్టడి లక్ష్యంగా విధులు

- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్ డూడి

చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను పూర్తి స్థాయిలో నిర్మూలిండమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో సోమవారం నూతన ఎస్పీగా నియమితులైన తుషార్ డూడి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా తన మొదటి కర్తవ్యంగా విధులు నిర్వ హిస్తానన్నారు. అలాగే పోలీసుల్లో వృత్తి నైపుణ్యతను పెంచే విధంగా ప్రణాళికలు రూపొందిచి అమలు చేస్తామన్నారు. చింతపల్లి ఎఎస్పీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్మిన్ ఎఎస్పీగా, వైఎస్ఆర్ కడప జిల్లా, గుంటూరు అర్బన్, గుంటూరు జిల్లాల్లో ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న తుషార్ డూడి సాధారణ బదిలీల్లో బాగంగా చిత్తూరు జిల్లా ఎస్పీగా నియమితులై సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

గణనాథునికి వైభవంగా పూలంగిసేవ

కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గణనాథునికి పూలంగిసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥ రాజమాణిక్యం నాయుడు అండ్ సన్స్, వేలూరు,శ్రీ కె.రాధాకృష్ణన్, కాణిపాకం ఉభయదారులుగా వ్యవహరించారు. వారు పగలు మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకపూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తిరిగి రాత్రి స్వామి వారికి పూలంగిసేవను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలోని గర్భాలయం, అంత్రాలయం, మహామండపంలను వివిధరకాల పరిమళ పుష్పాలతో విశేషాలంకరణ చేపట్టారు. ఇదిలా వుండగా సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాథుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊయలలో వుంచి ఊంజలొసేవను నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు,ఏఈఓ రవీంద్ర బాబు, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు బాలాజి నాయుడు, చిట్టిబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు,సర్పంచ్ శాంతిసాగంరెడ్డి, ఎంపీటీసీ సుధీర్, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాకారోత్సవం

కాణిపాకం ఆలయంలో సోమవారం రాత్రి పూలంగి సేవ అనంతరం ప్రాకారోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పూలంగిసేవను నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రధాన ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేయించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సాధనలో మహిళల ఆర్థిక సాధికారతే కీలకం

తిరుపతిరూరల్,సెప్టెంబర్15 ప్రభాతవార్త:

వికసిత్ భారత్ సాధనలో మహిళల ఆర్థిక సాధికారతే కీలకమని ...వికసిత్ భారత్‌కి కేంద్ర బిందువు...మహిళల అభివృద్ధే అని లోకసభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. పార్లమెంటరీ, శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సులో మహిళల సాధికారత కోసం స్థిరమైన ఆర్థిక సాధికారత మోడళ్ల అవసరాన్ని ప్రస్తావించి, తీర్మానం చేసారు. చారిత్రాత్మకంగా మహిళా సాధికారతకు అంకితమైన ఈ పార్లమెంటరీ సదస్సు ముగింపు సమావేశంలో ప్రసంగిస్తూ...లోకసభ స్పీకర్ మహిళల సాధికారత అనేది కేవలం సామాజిక అవసరం మాత్రమే కాకుండా ఆర్థిక అవసరం కూడా అన్నారు. మహిళల ఆరోగ్యం, విద్య నైపుణ్యాలు, వ్యాపారారంభంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా భారతదేశం అఫారమైన మానవ వనరులను వెలికి తీయగలదని, బలమైన సామాజిక, ఆర్థిక అభివృద్ధి నమూనాను నిర్మించగలదని తెలిపారు. వికసిత్ భారత్ వైపు భారతదేశ ప్రయాణంలో మహిల నాయకత్వం, సహకారం కీలకమని తెలిపారు. మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి సుసాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తొలి మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసారు. మహిళా సాధికారత సదస్సులో చేసిన తీర్మానాలు కొత్త ఆత్మ విశ్వసానికి శ్రీకారం చుట్టాయన్నారు. మహిళల సమాన హక్కులు, రాజకీయాలలో మరింత ప్రాతినిధ్యం విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు, సురక్షిత సమాజ నిర్మాణం, ఇవన్నీ కేవలం నినాదాలు కావని, మనం సాధించాల్సిన లక్ష్యాలని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో మహిళా సాధికారతకు పునాది వేసిన దార్శనికులు అల్లూరి సీతారామరాజు అని, ఆ దారిలో ముందుకు బలపరిచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని తెలిపారు. మహిళా శక్తి మనకు ప్రగతి శక్తి అని, ఆ శక్తిని సద్వినియోగం చేసుకున్న దిశలో వినియోగించకలిగితే మన దేశం మరింత బలపడుతుందన్నారు. మహిళా సాధికారతపై శాసనసభ కమిటీ స్థాపన మధ్యప్రదేశ్‌లోనే -భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి మహిళా సాధికారతపై శాసనసభ కమిటీ స్థాపన 1987లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభమైందని భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి తెలిపారు. 1997లో మహిళా సాధికారతపై పార్లమెంటరీ కమిటీ స్పష్టమైన, కీలకమైన లక్ష్యంతో ఉనికిలోకి వచ్చిందన్నారు. జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్తగా ఎదుగుతున్న టెక్నాలజీల సవాళ్ళను ఎదుర్కోవడానికి మహిళలను

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సాధికారపరచడం అనే విషయం ప్లీనరీ సెషన్స్‌లో జరిగిన చర్చలు లోతైన, దూరదృష్టి గల ఫలితాలను ఇచ్చాయన్నారు. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ద్వారా భారతదేశం యొక్క డిజిటల్ పరివర్తన కోసం కృషి చేస్తాయని, ఆర్థిక వ్యవస్థ, పాలన, ఉపాధిని పున:నిర్మించటానికి ఈ చొరవలను భాగస్వామ్యం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నామని పురందేశ్వరి తెలిపారు. సమాజంలో ముఖ్య పాత్రదారులు మహిళలు: రఘురామకృష్ణం రాజు సమాజంలో ముఖ్య పాత్రదారులు మహిళలే అని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఉపనిషత్తులు, పురాణాలు, మైత్రేయి గారి వంటి ప్రాచీన తత్త్వజ్ఞానుల శిక్షణల ఆధారంగా మహిళా సాధికారతపై ఇచ్చిన ప్రసంగాలను ప్రశంసించారు. లోకసభ స్పీకర్ ఓం బిర్లా రిమార్కులపై అభినందనలతో భారత్‌లో లింగ సమానతా ర్యాంక్, మెరుగుదల అవసరం ఉందన్నారు. 1997 ఏప్రిల్ 29న 11వ లోకసభలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కమిటీ దేశంలో మహిళా సాధికారత ఇక ప్రధాన మైలురాయిగా నిలిచిందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, లైజన్ అధికారులు, వివిధ రాష్ట్రాల డెలిగేట్స్, సూళ్లూరుపేట, పుట్టపర్తి జిల్లా ఎమ్మెల్యేలు, తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లతో సిఎం కాన్ఫరెన్స్

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నేరుగా నిధులు మంజూరు

- సిఎం నారా చంద్రబాబునాయుడును కోరిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

ఎస్సీ, ఎస్టీల హ్యాబిటేషన్ల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నేరుగా నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదటి రోజు జరిగిన సిఎం కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ సిఎం నారా చంద్రబాబునాయుడుకు వివరిస్తూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్లలో రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, ప్రత్యేక అధికారులను నియమించి అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షించడం జరుగుతున్నదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద జిల్లాకు నేరుగా నిధులు సమకూరిస్తే ఓవర్ హెడ్ ట్యాంకు పనులు, మంచినీటి సౌకర్యం వంటి అభివృద్ధి పనులు మంజూరు చేసి పనులు వేగవంతంగా పూర్తి చేయగలమన్నారు. అలాగే ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులకు నిధులు చెల్లించాల్సివుందని ఈ మేరకు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు త్వరలో చేపడుతామని సిఎం నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.

ఒంటరి ఏనుగును కట్టడి చేయడానికికి కుంకీ ఏనుగు

పలమనేరు టౌన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:

పలమనేరు, గంగవరం మండలాల్లో భీభత్సం సృష్టించి అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్‌ను గాయ పరచిన ఒంటరి ఏనుగును కట్టడి చేయడానికి అటవీశాఖ అధికారులు కుంకీ ఏనుగును రంగంలోకి దించారు. ఆదివారం రాత్రి చీకట్లో పలమనేరు సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద శిక్షణ పొందిన కుంకీ ఏనుగును నిలిపారు. ఈ సందర్భంగా పలమనేరు సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ఒంటరి ఏనుగు మళ్ళీ వచ్చేఅవకాశం ఉండడంతో ఈ కుంకీ ఏనుగును వినియోగిస్తున్నామని వివరించారు. పలమనేరు మండలం పెంగరగుంట అటవీ ప్రాంతంలో దాదాపు 20 కుంకీ ఏనుగులను పెంచి పోషిస్తూ శిక్షణ ఇస్తున్నామన్నారు. కుంకీ ఏనుగు ఒంటరి ఏనుగు వాసన పసిగట్టి తన వైపు మళ్ళించుకుంటుందని ఒంటరిగా వెళ్ళకుండా నిరోధించి మళ్ళీ అటవీ ప్రాంతంలోకి తీసుకు వెళుతుందని తెలిపారు. ప్రజలు కుంకీ ఏనుగును చూడడానికి తరలి రావద్దని అప్రమత్తంగా వుండాలి తప్ప ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని సూచించారు. గాయపడ్డ అటవీశాఖ ఉద్యోగా క్షేమంగా వున్నారని విరిగిన కాలు చేయికి శస్త్ర చికిత్స చేస్తున్నారని వివరించారు.

గ్యాలరీల్లో భక్తులకు సకల సౌకర్యాలు

రోజుకు 1.60లక్షలమంది భక్తులు చేరవేత

6వేలమందితో భద్రత

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టిటిడి అదనపు ఈఓ

తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు వాహనసేవలవీక్షణకు మాధవీధుల్లో గ్యాలరీల్లో సకల సౌకర్యాలు భక్తులకు కల్పించడం జరుగుతుందని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. మాధవీదుల్లోని గ్యాలరీల్లో 1.80లక్షలమంది నుండి 2లక్షలమంది వరకు భక్తులు వేచివుంటారన్నారు.వారందరికీ కూర్చునే సదుపాయం ఉందని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహనసేవలను తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు ఈఓ వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీని క్రమబద్ధీకరించడం, పార్కింగ్ అంశాలపై సోమవారం సాయంత్రం అన్నమయ్యభవనంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుమల అదనపుఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్‌తో కలసి టిటిడి విజిలెన్స్,తిరుమల పోలీసు అధికారులతో టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్షించారు.

మామిడి రైతుకు చెప్పినట్లు కేజీకి రూ.12 చెల్లించాలి

- మార్కెట్ యార్డు నుండి కలెక్టరేట్ వరకు రైతుల బైక్‌ర్యాలీ

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

మామిడి సీజన్ ప్రారంభంలో మామిడి రైతుకు చెప్పినట్లు కేజీ మామిడిపై రూ.12 చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని మామిడి రైతులు డిమాండ్ చేశారు. మామిడి కేజీకి రూ.12 ధర చెల్లింపుపై సోమవారం మామిడి రైతులు కొంగారెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీజన్ ప్రారంభంలో ఇచ్చిన హామీ మేరకు మామిడి కేజీకి రూ.12 చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మామిడి రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మామిడి రైతులు మాట్లాడుతూ సీజన్ ప్రారంభంలో మామిడి కేజీపై రూ.12 చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు కేజీ మామిడిపై రూ.4 చెల్లిస్తే కేజీపై మిగిలిన రూ.8 ఫ్యాక్టరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు చెల్లించాల్సివుందన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం చెప్పిన మేరకు మామిడి రైతులకు సబ్సిడీ ధర కేజీపై రూ.4 చెల్లించడానికి సిద్ధమైందన్నారు. ఫ్యాక్టరీలు సైతం మామిడి రైతుకు న్యాయపరమైన ధర చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీలు సైతం మామిడి కేజీపై రైతుకు రూ.8 చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఒకొక్క ఫ్యాక్టరీ ఒకొక్క ధరతో మామిడి రైతులకు చెల్లింపులు చేయడానికి సిద్ధం అవుతున్నాయన్నారు. అలా కాకుండా జిల్లాలోని ప్రతి ఒక్క ఫ్యాక్టరీ మామిడి రైతుకు కేజీపై రూ.8 కచ్చితంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

- జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశం

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:

ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించడంపై అధికారులు దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్, డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యుటీ కలెక్టరఝ్లు కుసుమకుమారి, విజయలక్ష్మీలు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతిష్టాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి దీనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నిర్దేశించిన కాలపరిమితిలో సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి పక్కాగా న్యాయం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 339 సమస్యలు

కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి సమస్యలపై 339 అర్జీలు అందాయి. ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి అర్జీల్లో వున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం అర్జీదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

రూ. 40 లక్షల విలువైన బంగారు, వెండి నగలు స్వాధీనం: దొంగ అరెస్టు

పలమనేరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు తాళాలువేసి ఉన్న ఇళ్ళను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను సోమవారం పలమనేరు పోలీసులు అరెస్టు చేశారు. అడపాల వెంకటశివ అనే దొంగను అరెస్టు చేసి నుండి రూ.40.36 బలక్షల విలువైన సుమారు 540 గ్రాముల బంగారునగలు, 336 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు డిఎస్పీ దేగల ప్రభాకర్ కథనం మేరకు తూర్పు గోదావరి జిల్లా పెద్దపూడి మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన అడపాల వెంకటశివ తరచూ దొంగతనాలకు పాల్పడేవాడు. ఇతనిపై దాదాపు 12 కేసులున్నాయి. పలమనేరు అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగస్టు 31న రాత్రి తెలుగుదేశం నాయకుడు రామ్మూర్తినాయుడు ఇంటికి తాళం వేసి ఉండగా తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. దీనిపై రామూర్తినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలమనేరు అర్బన్ సిఐ మురళీమోహన్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు ఎఎస్ఐ దేవరాజులురెడ్డి, సబ్ డివిజనల్ క్రైమ్ ఎఎస్ఐ శ్రీనివాసులు మొత్తం మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించి సోమవారం మధ్యాహ్నం 3:30 గంటలకు చిత్తూరు, బెంగళూరు హైవే పక్కనే ఆంజనేయ స్వామి గుడి వద్ద ముద్దాయి అడపాల వెంకటశివ వేచి ఉండగా అరెస్టు చేసి బంగారువెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుని కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు. పలమనేరు అర్బన్ సిఐ జిల్లా క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సబ్ డివిజనల్ క్రైమ్ పార్టీ, జిల్లా క్రైమ్ పార్టీ, బృందాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తిరుమలలో గవర్నర్ జస్టీస్ నజీర్

తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతిపర్యటన ముగించుకుని సోమవారం సాయంత్రం రాష్ట్రగవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్ తిరుమలకు చేరుకున్నారు. రచన విశ్రాంతి భవనం వద్ద టిటిడి ఇఓ అనిల్‌కుమార్‌సింఘాల్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శివయ్యకే శరగోపం !

దేవస్థానాలకు సరఫరా చేస్తున్న బ్రాండెడ్ బియ్యం ఇవే

2.భక్తులకు అందిస్తున్న పులిహోర

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు పులిహోర అత్యంత ఇష్టంగా తీసుకుంటారు. స్వామి అమ్మవార్లకు నైవేద్యం పెడతారు. భక్తులకు నిత్యాన్న ప్రసాదంలో రోజూ కనీసం 5వేల మందికి భోజనం పెడతారు.అలాంటి ప్రతిష్టాత్మక ప్రసాదాల తయారికి దేవస్థానం నాసిరకం బియ్యంను వాడుతున్నారు. వంటశాలలో మాస్టర్లు ఎంత రుచిగా తయారు చేయుటకు వస్తువులు వాడుతున్నా నాసిరకం బియ్యంతో తయారు చేసే అన్నం ముద్దలుముద్దలుగా మారుతుంది. తినటానికి ఇబ్బందిగా మారింది.సామాన్య భక్తులకు అందించే పులిహోర ముద్దలుగా దర్శనమిస్తుండగా విఐపిలకు అందించేది మాత్రం మేలురకం బియ్యంతో తయారు చేస్తున్నారు. భోళాశంకరునికి విరాళాలిచ్చే సామాన్య భక్తులకు నాసిరకం బియ్యంతో తయారు చేసిన పులిహోర ప్రసాదం అందిస్తుండగా పైసా విదల్చని విఐపిలకు మాత్రం మేలురకం బియ్యంతో తయారు చేసిన ప్రసాదాలందిస్తూ దేవస్థానం పబ్బం గడుపుకుంటుంది.

టెండర్లలో ఓ రకం: సరఫరాలో అదేగోతాల్లో నాసిరకం:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే టెండర్లలో నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే కాంట్రాక్టర్‌కు అర్హత. అయితే ఈ కాంట్రాక్టర్ టెండర్లలో చూపించే సరకులను అదే గన్నిల్లో(గోతాల్లో) నాసిరకం సరకులు సరఫరా చేస్తున్నరనడానికి పులిహోరాయే నిదర్శనంగా చెప్పవచ్చు. ఉదాహరణకు టెండర్లలో 'లలితా బ్రాండ్ బియ్యం' అని పేర్కొంటారు. ఇందులో మొదటి రకం బియ్యం ధరలను చూపుతారు.అయితే సరఫరా మాత్రం ఆశ్చర్యం కల్గిస్తుంది. మేలురకం బియ్యానికి నాసిరకం బియ్యానికి 26కిలోల బస్తాకు రూ.150 నుంచి 300వరకు తేడా ఉంటుంది. ప్రస్తుతం పులిహోరాకు వాడుతున్న బియ్యం ఎంఎన్‌లు అని తెలిసింది. అయితే టెండర్లలో పిలిచినట్లే అదే బ్రాండు గోతాల్లో సరఫరా చేస్తున్నారు కాబట్టి అటెండర్ నుంచి అధికారి వరకు పెదవి విప్పరు. ఇక పాలకులు ఏదో ఒక సారి పరిశీలించినట్లు 'ఆహా ఓహో అంటూ' కితాబు ఇస్తారు.'లోగొట్టు పెరుమాళ్ళుకే ఎరుక' అన్నట్లు మారింది.

ఎవరి వాటాలు వారికి:

రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలకు ఫలసరకుల సరఫరాకు ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం రూపొందించిన నిబంధనలతో ఒకే ఒక కాంట్రాక్టర్‌కు అర్హత వస్తుంది. వారే రాష్ట్రంలోని పెద్ద దేవాలయాలకు ఫల సరకులు సరఫరా చేస్తున్నారు. వీరు మూడో కంటికి తెలియకుండా అటెండర్ నుంచి ఉన్నతాధికారుల వరకు వాటాలను అందిస్తున్నారనే విమర్శలున్నాయి. దాంతో ఫల సరకుల సరఫరా జరుగుతున్న సరకుల నాణ్యత గురించి ఎవ్వరూ పరిశీలించరు. దాంతో కాంట్రాక్టర్ ఇష్తారాజ్యంగా మేలురకం సరకుల ధరలతో నాసిరకం సరకులను సరఫరా చేస్తూ 'దేవుళ్ళకే శరగోపం' పెడుతున్నారు. ఇది ఒక్క బియ్యం తతంగమే ఇక ఇతర సరకుల మాటేమిటో దేవళ్ళకే ఎరుక!

వ్యవసాయ బావిమోటారు చోరీ

పెద్దపంజాణి, సెప్టెంబర్15 ప్రభాతవార్త: మండలంలోని చలమంగళం గ్రామానికి చెందిన రైతు జి.భాస్కర్‌కు సంబంధించిన వ్యవసాయ బావి మోటారు చోరీ జరిగినట్లు బాధితుడు పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడురోజుల క్రితం తాను బావివద్ద సుమారు20వేల రూపాయల 3హెచ్‌పి సామర్థ్యంగల టెక్స్‌మో మోటారును బావివద్ద బిగించగా గురు తెలియని వ్యక్తులు మోటారును దొంగలించుకు పోయారని పేర్కొన్నారు. ఉదయం తాను బావివద్దకు వెళ్ళిచూడగా బావివద్ద మోటారు కనిపించడం లేదని దీంతో మోటారు చోరీజరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

సిద్ధేశ్వర ఆలయ భూములను కాపాడాలని గ్రామస్తుల నిరసన

గంగాధర నెల్లూరు 15 సెప్టెంబరు ప్రభాత వార్త :

మండల పరిధిలోని శ్రీ ప్రసన్న పార్వతీ సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామి దేవస్థానము మరియు శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ భూములను కబ్జాదారుల నుండి కాపాడాలని ఆలయ పరిసర గ్రామస్తులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కాషాయ కండువా జెండాలను పట్టి జైశ్రీరామ్ అంటూ భూ కబ్జాదారుల నుంచి ఆలయ భూములను రక్షించాలని స్థానిక కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉన్నత అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఆలయ భూములను కాపాడాలని లేనిపక్షంలో ఆలయ భూములను కాపాడుకోవాడానికి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ శ్రీనివానులకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలైన సిద్ధేశ్వర కొండ వింజం, వింజం మిట్టూరు, కృష్ణం పల్లె, పొంబల పల్లె, గడ్డం పల్లె, బాలగంగన పల్లె తదితర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

రొంపిచెర్ల, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడిన సంఘటన తిరుపతి మదనపల్లి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డు ఆదర్శ పాఠశాల వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అన్నమయ్య జిల్లా, పీలేరు మండలం, ఇందిరమ్మ కాలనీకి చెందిన విజయకుమార్ (23), అతని భార్య రాజేశ్వరి (20) తో కలసి పీలేరు నుండి తిరుపతి వైపుకు వెళుతుండగా రొంపిచెర్ల మండలం, రొంపిచెర్ల గ్రామపంచాయతీ, లక్ష్మి నగర్ కాలనీకి చెందిన ఎం.ఎస్ మహమ్మద్ గౌస్ పీర్ రొంపిచెర్ల నుంచి పీలేరుకు ద్విచక్ర వాహనంలో వెళ్లగా మార్గం మధ్యలోని ఆదర్శ పాఠశాల సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహమ్మద్ గౌస్ పీర్ తలకు తీవ్ర గాయమైంది. అలాగే విజయ్ కుమార్, రాజేశ్వరిలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహమ్మద్ గౌస్ పీర్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. సంఘటన స్థలాన్ని రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌లు సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

చౌడేపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త మైనర్ బాలిక అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లికి చెందిన సురేష్ కుమార్తె దివ్యశ్రీ(13) ఈనెల 10న ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్ళి పోయింది. అప్పటి నుంచి అన్ని చోట్లా వెతికినా ప్రయోజనం కనిపించక పోవడంతో బాలిక తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపిడిఓగా పెంచల వీరేంద్ర బాధ్యతలు స్వీకరణ

యాదమరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: యాదమరి ఎంపిడిఓగా పెంచల వీరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు ప్రభుత్వం ఎంపిడిఓలను కేటాయించడంతో యాదమరి ఎంపిడిఓగా పెంచల వీరేంద్రను నియమిస్తూ జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పెంచల వీరేంద్ర ఎంపిడిఓగా మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిడిఓ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఇన్‌ఛార్జీ ఎంపిడిఓగా విధులు నిర్వర్తించిన వేణు ఎఒగా యథాస్థానంకు వెళ్ళారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలకు సత్వర పరిష్కారం

చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ పి.లోకేష్, ఎపిసి నాగేంద్ర, ఆర్ఓ గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

– అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ పేర్కొన్నారు. జాతీయ ఇంజనీర్ల దినోత్సవంను సోమవారం అపోలో యూనివర్సిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డాక్టర్ పోతురాజులు భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఇంజనీర్ల దినోత్సవం కేవలం ఇంజనీర్లకు మాత్రమే కాదని, ప్రతి భారతీ యుడు గర్వంగా జరుపుకునే దినమన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామన్, డాక్టర్ హిమ బిందు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఎబి మంజు, అన్వేషాసాబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంబయ్యకండ్రిగ - కట్టమంచి బైపాస్ రోడ్డుకు మోక్షం

– భూమి పూజ చేసిన ఎంపి, ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: చిత్తూరు నగరపాలక పరిధిలో సంవత్సరాల తరబడి నిర్లక్ష్యానికి గురైన సాంబయ్యకండ్రిగ - కట్టమంచి బైపాస్ రోడ్డుకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించిందని పార్లమెంటుసభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు పేర్కొన్నారు. సోమవారం రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం ఎంపి మాట్లాడుతూ ఎంపి, మున్సిపల్, చుడా, ఆర్‌అండ్‌బి నిధులను సమీకరించి రూ.3.66 కోట్లతో 2.2 కిలోమీటర్ల మేర రోడ్డును ఒకటిన్నర నెలలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నగరంలో రహదారుల విస్తరణ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నా మని, బైపాస్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజి, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలో అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం సిఎం, ఆర్‌అండ్‌డి, మున్సిపల్‌శాఖల మంత్రులను కలసి వినతి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమీషనరు నరసింహప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయకమీషనరు ప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజులు, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఝాన్సి వెంకటేష్ యాదవ్, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ రమేష్‌నాయుడు, నగర తెదేపా అధ్యక్షుడు నరేష్, కార్యదర్శి పచ్చయప్ప, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ రమాదేవి మల్లీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిచే మెగా వైద్య శిబిరం

కల్లూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

శ్రీ రమాదేవి మల్లీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిచే మెగా వైద్య శిభిరాన్ని ఈ నెల 16వ తేది మంగళవారం ఉదయం 10 గంటలకు మంగళంపేట గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొంటారు. అందువల్ల పులిచర్ల మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది..కీలక పాత్ర

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ద్వారా సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గంగవరం, పలమనేరు మండలాల ఉపాధ్యాయుల గురుపూజోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగవరం, పలమనేరు ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, లీలారాణి, బాలసుందరంలతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు తులసీనాథంనాయుడు, కుబేరనాయుడు, లక్ష్మీ నారాయణ, భాస్కర్‌లు, మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, పలమనేరు సింగల్ విండో చైర్మన్ వెంకటరమణ(పెద్దబ్బ) తదతరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం : యుటిఎఫ్

పలమనేరు టౌన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని తక్షణం చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రణభేరి ప్రచార జాత కార్యక్రమంలో భాగంగా సోమవారం పలమనేరు ఎంబిటి రోడ్డులో ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుసున్నా విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యలు అలాగే వుండడం సరికాదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంటర్‌నెట్ యాప్‌ల భారం నుండి విముక్తి కలిగించి భోదనేతర పనులు లేకుండా పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జివి రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ను వెంటనే అమలు చేయాలని, సిసిఎస్ విధానం రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల మాటల్లో కనిపించే ప్రేమ చేతల్లో లేదన్నారు. 15 నెలల కాలంలో ఒక డిఎ కూడా మంజూరు చేయలేదని వేలాది కోట్లుగా పేరుకు పోయిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని నిలదీశారు. జిల్లా నాయకులు ప్రసన్న కుమార్, రెడ్డెప్ప నాయుడు, రెహనాబేగం, ఏకాంబరం, పార్థసారధి, ఎస్పీబాషా, డివిజన్‌నాయకులుప్రకాష్, కృష్ణమూర్తి, గౌస్‌బాషా, శశికుమార్, సాలేహా పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు ఆదర్శం

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు ఆదర్శప్రాయులని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం త్యాగులు, కృషి, దేశాభివృద్ధికి ఆయన చేసిన నిరంతర ప్రయత్నాలు ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. విజ్ఞానం, శ్రద్ధ, అంకితభావంతోనే విద్యార్థులు విజయాలు సాధిస్తారన్నారు. వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశోధన, ప్రాజెక్టులు, స్టార్టప్‌ల వైపు అడుగులు వేస్తే సమాజానికి ఉపయోగకరమైన పరిష్కారాలు లభిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు మాట్లాడుతూ కళాశాల అధా ంయపకుల నిరంతర కృషితో విద్యార్థులు జాతీయ స్థాయిలోఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అధ్యాపకులు పరిశోధనల్లో మరింత ముందుకుసాగాలన్నారు అనంతరం విశిష్ట బోధన, శాస్త్రీయపత్రాలు, పేటెంట్లు, ఆర్‌అండ్‌డి రంగంలో సాధించిన విజయాలకు గుర్తింపుగా అధ్యాపకులను యాజమాన్యం సత్కరించింది. ఈసందర్భంగా విద్య, పరిశోధన రంగాల్లోప్రతిభచూపిన అధ్యాపకులకు రెండు లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందించారుఆర్‌అండ్‌డిడైరెక్టర్‌డా॥కోదండరామయ్య, అన్నివిభాగాలహెచ్‌ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ల చాంబర్ ప్రారంభం

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ల చాంబర్‌ను సోమవారం ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను కౌన్సిలర్లు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, సురేష్, వేలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కళ్యాణోత్సవ నిర్వహణపై టిటిడి అధికారులతో సమీక్ష

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త పెరటాసి మాసం సందర్భంగా అక్టోబర్ 4న బేటరాయస్వామి కొండ వద్ద నిర్వహించే శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహణపై సోమ వారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ టిటిడి అది .కారులతో సమీక్షించారు. సోమవారం పలువురు టిటిడి అధికారులు కుప్పం వచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహణ, భక్తులకు వసతులు, కళ్యాణోత్సవ ఏర్పాట్లు తదితరాలపై అధికారులతో చరి ంచారు. కార్యక్రమంలో కడ పిఎసి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, సర్పంచ్ జెకె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్‌లో తక్కువ వడ్డీకే బంగారు, గృహ రుణాలు

– మేనేజర్ పట్టాభి శివ

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త కుప్పం కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్‌లో ప్రజలు, రైతులకు తక్కువ వడ్డీ కే బంగారం, గృహ రుణ వసతి కల్పిస్తున్నట్లు బా ంక్ మేనేజర్ పట్టాభి శివ తెలిపారు .గ్రాముబంగారంకు రూ 6700 లరుణం అందిస్తున్నామన్నారు. అలాగే వడ్డీని 12శాతం నుంచి 9శాతానికి తగ్గించామన్నారు. తమ బ్యాంకు పరిధిలో చేసే డిపాజిట్లకు సంబంధించి ఇతర బ్యాంకులు ఎవరూ ఇవ్వని రీతిలో 8.5శాతం వడ్డీ చెల్లించడం జరుగుతోందన్నారు. బ్యాంకు పరిధిలో ఆర్టీజిఎస్, నెఫ్ట్ సేవలు సైతం అందుబాటులో తెచ్చామన్నారు. ప్రస్తుతం బ్యాంకు పరిధిలో ఉన్న ఖాతాదారులకు డివిడెంట్ల చెల్లింపుకు చర్యలు చేపట్టామన్నారు. బ్యాంకు పాలకవర్గం ఏర్పాటు కాగానే పాలకవర్గంతో చర్చించి ఖాతాదారులకు డివిడెంట్ చెల్లింపుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రుణగ్రహీతలు బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు

యువత విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలి

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త యువత విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టేలర్ స్కూల్ గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డా॥ కంచర్ల మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో అత్యాధునిక రీతిలో 22 కోట్లతో తొలివిడత ఎన్టీఆర్ స్టేడియంను నిర్మిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకుతమవంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు. లయన్స్‌క్లబ్ సర్వింగ్ హ్యాండ్స్ వారు క్రీడా పోటీలకు వసతులు సమకూర్చడం పట్ల వారిని అభినందించారు. అందరూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పిఆర్‌కుమార్, తహశీల్దార్ శివయ్య, ఎస్సై నరేష్, ఎంఇఒలు సెల్వపాండియన్, చంద్రమ్మ, నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, జనార్దనరెడ్డి, డా॥ మురుగేష్, మణి, ఎల్.జయరాంరెడ్డి, చంద్ర, గోపాల్, చలపతి, మురుగేష్, చిట్టి, మురళి, శంకర్, రాజు పాల్గొన్నారు.

మెగా డిఎస్సీతో కూటమి ప్రభుత్వం చరిత్ర - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు 16347పోస్టులతో మెగా డిఎస్సీ నిర్వహించి కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించినట్లు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఏటా మెగా డిఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మెగా డిఎస్సీలో 15941మంది అభ్యర్థులు ఎంపికయ్యారని వారిలో యాభైశాతం మహిళలు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షసాధించిందన్నారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించడం, మద్యం దుకాణాల ముందర కాపలా పెట్టించడం వంటి పనులు చేయించారన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించలేదన్నారు.

మంత్రి అచ్చెన్నను కలసిన వి.కోట నేతలు

వి.కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావును రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఎఎం రంగనాథ్, ఇతర టిడిపి నేతలు మర్యాద పూర్వకంగా విజయవాడలో కలిశారు. ఈకార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణ స్వామి, హరినా థరెడ్డి, నేతలువిశ్వేశ్వరరావు, శ్రీనివాసు లు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు (మంగళవారం)

పగలు : అభిషేకం రాత్రి : తెప్పోత్సవం

ఉభయదారులు : కీ॥శే॥ శ్రీ గాలి పుండరీకనాయుడు, వారి కుమారుడు శ్రీగాలి శేషాచలంనాయుడు కాకర్లవారిపల్లె, కీ॥శే॥ శ్రీ.ఆర్.శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ జి.హనుమంతనాయుడు వారి కుమారులు, అడపగుండ్లపల్లె, కీ॥శే॥ యం.రామకృష్ణారెడ్డి గారి కుమారుడు ఎం.జగన్నాథరెడ్డి, కాణిపాకం, శ్రీ గురుజాల దామోదరనాయుడు, కొత్తపల్లె, కీ॥శే॥ చల్లగుండ్ల దామోదరనాయుడు వారి కుమారులు, కాకర్లవారిపల్లె, శ్రీగురుజాల ఆనందనాయుడు అండ్ బ్రదర్స్ దిగువ మారేడుపల్లె, శ్రీలంకిపల్లె మోహన్‌బాబు, 44 బొమ్మసముద్రం

విద్యార్థులకు జనరల్ నాలెడ్జి పుస్తకాలు వితరణ

సదం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

మండల పరిధిలోని పాలమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎన్నారై భవ్య జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు దేశభక్తుల కథలు, నీతి కథలు పుస్తకాలు వితరణంగా అందజేశారు. తన అవ్వ దివంగత కోటిక వరదమ్మ పేరు మీద ఈ పుస్తకాలు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు నిరంజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త కే కరీముల్లా, ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ కే నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

దసరా ఉత్సవాలకు నాగబాబుకు ఆహ్వానం

పుంగనూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని చదళ్ల గ్రామంలో శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి దసరా ఉత్సవాలకు రావాలని జనసేన నాయకుడు నాగబాబుకు పార్టీ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి ఆహ్వానం పలికారు. సోమవారం ఈ మేరకు ఎన్వీఆర్ ట్రస్ట్ అధినేత వేణుగోపాల్ రెడ్డి తోపాటు ట్రస్ట్ సభ్యులు సుకుమార్ రెడ్డి నారాయణరెడ్డి తదితరులు నాగబాబును ఆయన నివాస గృహంలో కలిశారు. ఈ సందర్భంగా సోమల మండల కేంద్రంలో జరిగిన సభను గుర్తుచేసిన నాగబాబు ఆ సభ విజయవంతం చేసిన వేణుగోపాల్ రెడ్డిని అభినందించారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కళాకారులను ఆహ్వానించి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేణుగోపాల్ రెడ్డి ఆయనకు వివరించారు. రాష్ట్ర టిట్కో చైర్మన్ అజయ్ కుమార్‌ను కలసి ఉత్సవాలకు ఆహ్వానించారు.

హిందు దేశంలో అందరూ హిందీ భాష నేర్చాలి

పుంగనూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

హిందూ దేశంలో ప్రజలందరూ హిందీ భాషను నేర్చుకోవాలని, హిందీ హిందువుల భాష అని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ అధ్యాపకురాలు ప్రవంతి అన్నారు. సోమవారం జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా శిబిరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. టి .శ్రీనివాస్ ఆధ్వర్యంలో హిందీ దినోత్సవం నిర్వహించారు. హిందీ భాష నేర్చుకోవడం వల్ల వివిధ రంగాలలో రాణించవచ్చని, ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో హిందీ ఉన్నత స్థానంలో ఉన్నదని, హిందీ సాహిత్యంలోని వివిధ అంశాలను వివరిస్తూ...1949 సెప్టెంబర్ 14 హిందీ భాషను భారత రాజ్యాంగం భారతదేశ అధికార భాషగా..దేవ నాగరి లిపితో ఆమోదించబడిందని తెలియ జేశారు.

లోకేష్ కృషితో నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజలు

**పూతలపట్టు, సెప్టెంబర్ 15

తిరుపతి డివిజన్

ఖైదీలకు ఎయిడ్స్ అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి ఆదేశాలతో శ్రీకాళహస్తి ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం శ్రీకాళహస్తిలోని సబ్‌జైలులో ఖైదీలకు ఎయిడ్స్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీకాళహస్తిలో స్టెప్స్ స్వచ్ఛంద సేవ సంస్థను డాక్టర్ ప్రమీలమ్మ ప్రారంభించి సుమారు పాతిక సంవత్సరాలుగా ఎయిడ్స్‌కు సంబంధించి అవగాహన వైద్యసదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్ పర్యవేక్షణలో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయన ఖైదీలనుద్దేశించి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తికి కారణాలు, హెచ్ఐవి రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది పవన్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

వాహన మిత్ర పథకం కూటమి వరం

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త వాహన మిత్ర పథకం కూటమి ప్రభుత్వ వరమని ఏర్పేడు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, యజమానులకు దసరా నుంచే వాహన మిత్ర అందించటం వారి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు. రాబోవు రోజుల్లో సూపర్ సిక్స్ లాంటి మరెన్నో పథకాలను అందిస్తారని నాగరాజునాయుడు అన్నారు.

వాటర్ రిసోర్స్ శాఖ సిబ్బందికి ఉత్తర సేవా పురస్కారాల అవార్డులు

తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త 58వ ఇంజనీర్స్‌డే సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తిలో పని చేస్తున్న పలువురు వాటర్‌రిసోర్స్ శాఖ సిబ్బంది, అధికారులకు అవార్డులను చీఫ్ ఇంజనీర్ వర ప్రసాద్ తెలుగుగంగ, గాలేరు నగరి సుజలస్రవంతి ఎస్ఇ రాధాకృష్ణమూర్తి సారధ్యంలో అవార్డులను అందజేసారు. సమాజంలో నేడు ఇంజనీరింగ్ విభాగం మనగడ సాగిస్తుందంటే నాడు మోక్ష గుం విశ్వేశ్వరయ్య అందించిన నైపుణ్యాలు, సేవలన్నారు. ఈ నేపథ్యంలో వాటర్ రిసోర్స్ శాఖ ఉత్తమ సేవా పురస్కారాలను తిరుపతిజిల్లా అధ్యక్షుడు పి.వి.సుబ్బారెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ వి.చంద్రశేఖర్‌లు అవార్డులు అందుకున్నారు. వారికి స్థానిక సిబ్బంది అభినందించారు.

ఓ సీనియర్ నాయకుని పోగొట్టుకున్నాం:

తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం ఇలగనూరు గ్రామానికి చెందిన సీనియర్ వైకాపా నాయకుడు పాచి పెంచులయ్య హఠాన్మరణం పార్టీకి తీరని లోటు అని శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి నివాళులర్పించారు. గ్రామంలోని పెంచులయ్య ఇంటికి వెళ్ళి మృతదేహానికి నివాళులర్పించారు. పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు పాచి చిన్న వెంకటయ్య, సుబ్రమణ్యంనాయుడు, సుబ్రమణ్యం యాదవ్, పాచి కాళయ్య, పొచులయ్య, మణి, బుల్లెట్ జయశ్యామ్, పసల సురేష్, నక్క రమణయ్య పాల్గొన్నారు.

17 నుంచి ప్రధాని జన్మదిన పక్షోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షోత్సవాలు' నిర్వహించుటకు బిజెపి నిర్ణయించిందని బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్ సారధ్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంపులు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, దివ్యాంగులకు సత్కారం, క్రీడల పోటీలు, అన్నదానాలు నిర్వహిస్తామని వివరించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనరేంద్ర మోదీ జన్మదిన కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెల 17న రక్తదానం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ మాజీ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కూనాటి నాగరాజు, జిల్లా కార్యదర్శి మునీశ్వరి, ధర్మయ్యయాదవ్, కోనేటి అయ్యప్ప, మండల అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, ఏదం కృష్ణయ్య, భగీర్తివెంకటేష్, తిరుమలశెట్టి నరేష్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞ కన్నా వవెంకటేశ్వర్లు లింగాబత్తిన గోపాల్, మోదుగల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు చందు రాయల్, ఆముదాల మునిరాజా, సురేష్, కందాటి సుధాకర్, సుబ్బయ్య, ఆకుల విజయ్, లావణ్య, యువమోర్చా సభ్యులు చోటు, రవి రాయల్, తులసి, శివారెడ్డి, భీమవరం సాయి, కిరణ్, సుబ్రమణ్యం, దట్టం బాలు, శివ, రాజా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త రైతులు పండించిన వరి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి డిమాండ్ చేసారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయ ప్రధాన ప్రాంతంగా ఉందన్నారు. అయితే వరి కోతల సమయంలో ఆకాల వర్షాలు నడ్డివిరిస్తుందన్నారు. దాంతో రైతులు పండించిన వరి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేసారు. దేశానికి వెన్ను ముక రైతన్న అంటూ వేదికల మీద అధికార పార్టీలు గొప్పలు చెప్పుకుంటూ ఆచరణలో మొండిచేయి చూపుతున్నారన్నారు. ఇక దిగుబడి రాకపోవటంతో రైతులు తల్లడిల్లుతున్నారన్నారు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకొనుటకు పంట నష్టాన్ని అంచనా కట్టి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఆయనతో పాటు మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, పట్టణ యువజన అధ్యక్షుడు ఆంటోని, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షుడు నవీన్, నాగరాజు, మహేష్, సంతోష్, జోసెఫ్, చరణ్, అల్లావుద్దీన్, సారధి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శించే స్థాయి రోజాకు లేదు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ నాయకుడు పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి మాజీ మంత్రి రోజాకు లేదని ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఖండించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల కోసం అధికారానికి వచ్చిన తరువాత కాదని ఎన్నికల ముందు కకూడా ఆయన తన సొంత సంపాదనతో ంరైతుల్ని ఆదుకునే వారన్నారు. రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ రైతుల సమస్యలపై దృష్టిసారించారు. అంతేకాక గ్రామాణాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసారన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్న పవన్‌కళ్యాణ్‌ను రోజా ఇష్టానుసారంగా విమర్శించటం తగదన్నారు. రోజా పరిపాలనలో సంపాదనను గుర్తుతెచ్చుకోవాలన్నారు. రోజా బహిరంగసభలో చర్చకు రావాలన్నారు.

ఆడపిల్ల పుట్టుకను స్వాగతించాలి:

తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త సమాజంలో ఆడపిల్ల పుట్టుకను ప్రతి ఒక్కరు సాధించాలని సిడిపిఓ శాంతి దుర్గ అన్నారు. సోమవారం మండలంలోని శేషమనాయుడు కండ్రిగ గ్రామంలో అంగన్‌వాడి కేంద్ర పరిధిలో మాతాశిశుమరణాల ఆరికట్టాలని, ఆడిపిల్ల పుట్టుకను సంతోషంగా స్వాగతించాలన్నారు. పోషకాహారంలోపం తగ్గించాలని, గ్రామంలో ఎక్కడ కూడా బాల్యవిహాహాలు జరగకూడదని పిల్లల సంరక్షణ, ఆరోగ్యం, పోషణపై మిషన్‌శక్తి మిషన్ వస్త్సల్య ప్రోగ్రామ్ మీద సిడిపిలో శాంతి దుర్గ గర్భిణీలు బాలింతలు మహిళలు గ్రామస్తులు అవగాహన కార్యక్రమాలనునిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ మారియమ్మ, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ లక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు సహాయకులు హాజరయ్యారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు

సురక్షితమైన సౌకర్యవంతమైన ప్రయాణం -డిపిటిఓ జగదీశ్

తిరుపతి, సెప్టెంబర్ 15ప్రభాతవార్త: తిరుమలేశుని బ్రహ్మోత్సవాల్లో భక్తులకు తొమ్మిదిరోజులు సరక్షితమైన సౌకర్యవంతమైన ప్రయా ణమే లక్ష్యంగా ఆర్టీసి సిబ్బంది సేవలందించాలని డిపిటిఓ జగదీశ్ కోరారు. రోజువారీగా భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. తిరుమల-తిరుపతి, తిరుపతి- తిరు మల మధ్య ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణీకులకు సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌బస్సులు, విద్యుత్ బస్సుల కండీషన్‌ను అలిపిరి వద్ద తనిఖీ చేయాలన్నారు. 335 సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు, 64 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయన్నారు. లోపాలులే కుండాతొమ్మిదిరోజులలు భక్తులకు సేవాభావంతో సేవలందించా లన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలుగా ఎమరాల్డ్స్ విద్యార్థులు

తిరుపతి విద్య సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: వివేకానంద కేంద్ర తెలుగు ప్రాంత్ వారు నిర్వహించిన రీల్స్ (షార్ట్ విడియో) మేకింగ్ పోటీలలో తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల, ద్వితీయ బీకామ్ విద్యార్థులైన లాస్య ఆనంద్, గీత పరీక్, ప్రతిభ నాయుడు, శ్వేత లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజేతలుగా నిలిచారని కళాశాల ఉప సంచాలకులు మునిరత్నం తెలియజేశారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ లు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు సమాజ హితమైన మరిన్ని సందేశాత్మకమైన రీల్స్ చేస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. హైదరాబాద్, మెహదీపట్నం పుల్లారెడ్డి డిగ్రి కలశాలలో విజేతలకు హైడ్రా కమీషనర్ రంగనాథ్ బహుమతి ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా రెయిన్బో విద్యార్థుల ర్యాలీ

.రేణిగుంట సెప్టెంబర్ 15 ప్రభాతవార్త ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా రేణిగుంట పట్టణంలోని రెయిన్బో విద్యా సంస్థల విద్యార్థులు సోమవారం స్టూడెంట్ లెడ్ మూమెంట్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు శాంతిని ప్రబోధించే ప్లకార్డులు చేతపట్టుకొని రేణిగుంట పట్టణ వీధుల్లో శాంతి కపోతాల మాదిరి ర్యాలీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ షాహేరాబాను మాట్లాడుతూ భారత ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ స్వాతంత్రానంతరం మొట్టమొదట శాంతి స్థాపనకు నడుంబిగించారని అన్నారు. అదే మార్గంలో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో శాంతి స్థాపన చేస్తున్నారన్నారు. పిల్లలకు చిన్నప్పటినుండి అహింసా మార్గాన్ని అలవర్చుకునేలా చేయాలని ముఖ్యంగా శాంతిని ప్రబోధించాలని తెలిపారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాఠశాల బోధన భోదనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంటలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం...

రేణిగుంట సెప్టెంబర్ 15 ప్రభాతవార్త రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల మైదానం నందు సోమవారం మండల స్థాయి పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. రేణిగుంట మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్టు ఎంఈఓ రంగనాథ్ తెలిపారు. దాదాపు మండల వ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. వాలీబాల్, కబాడీ కోఖో, బాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్, పోటీలు జరుగుతాయి అన్నారు. పోటీలను మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రావు, పిడి నాగయ్య , శ్రీధర్, సత్యనారాయణ, శ్రీనివాసులు, శకుంతల, భార్గవి, పద్మలత, పద్మ, నాగలక్ష్మి, శ్రీనివాసులు తదితరుల సమక్షంలో ఇన్చార్జి హెడ్మాస్టర్ అల్లా బక్షు ఎంఈఓ రంగనాథ్ పోటీలను ప్రారంభించారు.

సిఐటియు మండల కన్వీనర్ గా సెల్వరాజ్.

రేణిగుంట సెప్టెంబర్ 15 ప్రభాతవార్త రేణిగుంట మండలం సిపిఎం అనుబంధ కార్మిక సంఘం సిఐటియు కన్వీనర్ గా సెల్వ రాజును సోమవారం రేణిగుంట పట్టణ సుందరయ్య భవన్ నందు సిపిఎం, సిఐటియు నేతల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సిఐటియు అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి జై చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, బిల్డింగ్ రంగ జిల్లా కార్యదర్శి మునిరాజ సమక్షంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 21 మందితో కమిటీని ప్రకటించారు, మండల కన్వీనర్ గా సెల్వరాజ్, కమిటీ సభ్యులుగా కొండ్రెడ్డి హరినాథ్, రాజశేఖర్, దీప, ఈశ్వరమ్మ, రవి, అమ్ములు, ధనమ్మ, అంబిక, లక్ష్మీ, మనీలా, నారాయణ, ముని రాజా, శివ, పురుషోత్తం, రోసి రెడ్డి, ముని కృష్ణారెడ్డి, దస్తగిరి, రామిరెడ్డి, మస్తాన్, ఏకగ్రీవం అయ్యారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఓ వి రమణ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, సత్య శ్రీ, భారతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, లింగనిర్ధారణపై అవగాహన

భాకరాపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, లింగనిర్ధారణ పై వైద్యాధికారి డాక్టర్ తేజస్విని, వైద్య ఆరోగ్యాశాఖ డెమో కిరణ్ కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం వివాహ వయసు అబ్బాయికి 25, అమ్మాయికి 21ఉండాలన్నారు. కొందరు లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్నారని అలా చేయడం వల్ల లింగణిష్పత్తి తగ్గుతుందని తెలిపారు. శివకుమార్, సుబ్రహ్మణ్యంపాల్గొన్నా రు.

బాలసుబ్రహ్మణ్యం మృతదేహానికి శంకర్‌రెడ్డి ఘన నివాళి

సత్యవేడు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: సత్యవేడు మండలం ఎన్ఆర్ ఆగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండల ప్రధాన కె.బాలసుబ్రహ్మణ్యం(75) మృతదేహానికి టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త శంకర్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో సోమవారం ఉదయం ఎన్ఆర్ ఆగ్రహారం స్వగృహంలో బాలసుబ్రహ్మణ్యం మృతి చెందాడు. సమాచారం అందుకున్న శంకర్‌రెడ్డి స్థానిక టీడీపీ నేతలు కృష్ణయ్య యాదవ్, రాధాకృష్ణ, శివయ్య, హేమభూషణం, వాసు, మురళి(చికెన్ చిన్న), సర్పంచ్ బాలాజీ, రాజశేఖర్‌రెడ్డి, రూబెన్ తదితరులతో కలసి ఎన్ఆర్ ఆగ్రహారం గ్రామానికి చేరుకుని బాల సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. అలాగే కొత్తమారికుప్పం పంచాయతీ అమావాస్‌రెడ్డి కండ్రిగలో అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన తాండవకృష్ణ(52) మృతదేహాన్ని శంకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. స్థానిక టీడీపీ నేతలు అమావాస్‌రెడ్డి, దేవేంద్ర తదితరులు ఉన్నారు.

పది రూపాయల పోస్టల్ ఆర్డర్ నో స్టాక్...

సత్యవేడు, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: సత్యవేడు తంతి తపాలా కార్యాల యంలో పది రూపాయల పోస్టల్ ఆర్డర్ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సమాచారం పొందేందుకు విధిగా రూ.10 పోస్టల్ ఆర్డర్‌ని జత చేయాల్సి ఉంటుంది. కొద్ది రోజులుగా పోస్టల్ ఆర్డర్ లేకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. పోస్టల్ ఆర్డర్ విషయంపై తపాలా శాఖ అధికారులను ప్రశ్నిస్తే...నోస్టాక్...వస్తే ఇస్తాం...అంటూ సమాధానం ఇవ్వడం జరుగుతోంది.

జాతీయస్థాయిలో సత్తా చాటిన అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు

తిరుపతి విద్య సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: పరుల్ యూనివర్శిటీ సంవిధాన్ పే చర్చా 2025 జాతీయస్థాయిలో నిర్వహించిన మూట్ కోర్టు ఫలితాలలో అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు మొదటి రన్నరప్ ప్రైజ్తో పాటు క్యాష్ అవార్డును కైవసం చేసుకున్నారు. తమ కళాశాల నుంచి చిన్మయి, సాహితీ, హర్షిత పాల్గొని ఫస్ట్ రన్నరప్ ప్రైజులో లా కమిషన్ ఆఫ్ ఇండియా హానరబుల్ ఛైర్పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిసింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయకుమార్ శుక్ల చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. జాతీయస్థాయిలో 110 కళాశాలల్లో పాల్గొన్న ఈ పోటీలలో అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి, మొదటి రన్నరప్ ప్రైజును అందుకున్నారని కళాశాల ఛైర్మెన్ డా తిప్పారెడ్డి తెలియజేశారు. రీసెర్చ్ టెస్టులో సెకండ్ ప్రైజును హర్షిత కైవసం చేసుకున్నట్టు తెలిపారు.

శ్రీరామలో ఆ ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: స్థానిక కరకంబాడి రోడ్ లో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా కళాశాల చైర్మన్ మన్నెం. రామిరెడ్డి మొదటగా మోక్షగుండం. విశ్వేశ్వరాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో మోక్షగుండం అనితర అసాధ్యమైన సేవలు మరియు కట్టడాలు నిర్మించారు అని ఉదాహరణకు తిరుమల రోడ్ అని తెలిపారు. ఇంజినీర్ అనే వారు నిరంతరం అధ్యయనం చేస్తూ నూతన విషయాలు, పరికరాలు కనుగొని ఈ సమాజానికి సేవ చెయ్యాలి అని తెలిపారు. అనంతరం డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ వారు విద్యార్థులకు లోగో క్రియేషన్, వర్కింగ్ మోడల్స్, ఎలోక్యూషన్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం. రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం. అరవిందుకుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎన్.వాసు, సివిల్ విభాగ అధిపతి బి.బాలకృష్ణ భరత్, విద్యార్థులు పాల్గోనారు.

మంచినీటిసరఫరాకు చర్యలు

విజయపురం, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: మండల పరిధిలో కేశవపురం, ఆది ఆంధ్రవాడ గ్రామాలకు ఇళ్ళత్తూరు పైలట్ ప్రాజెక్టు మంచినీటి సరఫరా స్కీం ద్వారా ఏర్పాటు చేసిన పైపులైన్ చిన్న జంబాడ సమీపంలో మరమ్మతులకు గురై మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శనివారం సంబంధిత కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టి ఆ గ్రామాలకు మంచినీటిని యథాతథంగా సరఫరా చేయడం జరిగింది. మండల పరిధిలో తరచూ బీఎస్ఎన్ఎల్ కేబుల్ నెబ్‌వర్క్ వాళ్లు పైపులైన్లు డామేజ్ చేస్తున్నారని, అటు మండల ప్రజలు ఇటు మంచినీటి సరఫరా నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెంకటేష్ నాయుడుకు ఎమ్మెల్యే నివాళి

విజయపురం, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:

మండలంలోని తెల్లగుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గ్రామా నికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

..ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 21 వినతులు..

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కు 21 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 11 మంది నేరుగా వచ్చి సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించగా, పది మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ:ఒకరు మృతి



భాకరాపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పీలేరు-తిరుపతి జాతీయ రహదారి యాడంవారిపల్లి వద్ద ఆదివారం రాత్రి 11గం ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్టు భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. అయన కథనం మేరకు పీలేరు నుండి భాకరాపేట వైపు వస్తున్న రవికి తీవ్రగాయాలు కాగా, కేవీ పల్లి మండలం మహల్ రాజుపల్లికి చెందిన నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు.

ప్రతి మహిళ ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలి..!

రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని డిఆర్‌డిఏ పిడి పి.ఎన్.శోభన్‌బాబు అన్నారు. సోమవారం సి.రామాపురంలోని మహాభారత ఆలయం వద్ద పశుసంవర్ధకశాఖ సమన్వయంతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం ఈజిసి, సిఎం ఎఫ్ఎంఈ ద్వారా ప్రతి మహిళకు 35 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామ న్నారు. మహిళా సంఘాల సభ్యులు స్వయం జీవనోపాధి కోసం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేకలు, గొర్రెలు, పశువులను కొనుగోలు చేసే సమయంలో పశుసంవర్ధశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం గురుమూర్తి, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జైకిషోర్, సిసి గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయండి

తిరుపతి హెల్త్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త ః టీటీడీలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్, సరస్వతమ్మ కూటమి ప్రభుత్వానికి, టీటీడీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ మాట్లాడుతూ టీటీడీ దాదాదపు 15 సంవత్సరాల నుంచి

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఎనలేనివి : ఈఈ

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ గూడూరు వారి ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని జాతీయ ఇంజనీర్ల దినోత్సవంను పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు నిర్వహించడం జరిగినది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయతీరాజ్ ఈఈ బి. రమణయ్య మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనిపించిన వివిధ శాఖల 12 మంది ఇంజనీర్లను సన్మానించడం జరిగినది. ఈ సమావేశ మందు రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. గిరినాథ్, డిఈఈలు టి. శ్రీనివాసులు, ఎస్. చైతన్య కుమార్, టి.శ్రీనివాసులు రెడ్డి, ఆర్ అండ్ బి అసిస్టెంట్ ఇంజనీర్ పి. ఆర్. గిరినాథ్, ఎలక్ట్రిసిటీ చిల్లకూరు అసిస్టెంట్ ఇంజనీర్ బి. శేషాద్రి, రిటైర్డ్ ఏఈ బీ. సీనయ్య, ఇలియాజ్ అహ్మద్, లయన్స్ క్లబ్ ప్రముఖులు షేక్ రియాజ్ అహ్మద్, మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, జగదీష్, శివయ్య, సెక్రటరీ రవిచంద్ర, ట్రెజరర్ వీరేంద్రనాథ్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సత్తార్ హుస్సేన్, రామచంద్రయ్య, డి.కృష్ణ బాబు, ఇంజనీర్లులు పాల్గొన్నారు.

రోడ్లు ధ్వంసం చేస్తున్న సంస్థలపై చర్యలు : చైర్మెన్

నాయుడుపేట, సెప్టంబర్ 15 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలో విచ్చల విడిగా ఎక్కడపడితే అక్కడ రోడ్లను ధ్వసంచేసి మరమ్మతులు చేపట్టకుండా వదిలేస్తున్న ప్రవేటు గ్యాస్ పైప్‌లైన్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపాల్టి చేర్మేన్ కటకం దీపిక అధికారులను ఆదేశించారు. ఆమె ఆధ్వర్యంలో సోమవారం అంబేధ్కర్ భవన్‌లో కౌన్సిలర్లు సాధారణ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లడుతూ పట్టణంలో తాగునీరు సమస్యలు తలెత్తకుండ చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజి కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపాల్టిలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులపై కౌన్సిలర్లుతో చర్చించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ ఉరుకుందమ్మ, కౌన్సిలర్లు,అధికారులుతదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఘనంగా ఇంజనీర్స్ డే

కోట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మానవ ప్రగతి ప్రస్థానంలో ఇంజనీరింగ్ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, భారీ ఆనకట్టలు, వంతెనలు.. ఇలా అన్నింటిలోనూ ఇంజనీరింగ్ నిపుణులు తమ అసాధారణ ప్రతిభతో నిర్మించ గలుగుతున్నారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారెడ్డిలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంజనీరింగ్ నైపుణ్యం, పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధి వైపు అడుగులు వేసేలా అహర్నిశలు కష్టపడిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను భారతీయ ఇంజనీరింగ్ పితామహుడిగా అభివర్ణించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి భారతీయ నవయువ ఇంజనీర్లు సమాజంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న వరదలు వంటి సమస్యలకు ఇంజనీరింగ్ ద్వారా పరిష్కారం వెతికి దేశం ముందుంచాలని, అప్పుడే విశ్వేశ్వరయ్య కన్నకలలను సాధించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ డీన్ డి.శ్రీనివాస్, అసోసియేషన్ ఇన్‌ఛార్జ్ పి.దిలీప్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పుల గురించి అవగాహన

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యధుమధి ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ సొసైటికి చెందిన గీథిక వెంకటేసన్ కాలుష్యం, వాతావరణ మార్పుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శివప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణహిత ఉత్పత్తుల వాడకం, శిలాజ ఇంధనాల వాడకం తగ్గించాలన్నారు. నీటి వనరులను కలుషితం చేయకుండా చూసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు వై. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ పి. నారాయణ రాజు, డాక్టర్ కోటేశ్వరరావు, కిరణ్మయి, శ్రీధర్ శర్మ, డాక్టర్ ఝాన్సీ వాణి, కృపా కరుణవాణి, డాక్టర్ శైలజ, రవి రాజు, రమేష్, పద్మమ్మ, సుందరమ్మ, ఉష, శ్రీలత, తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, ఏఐటియూసి నియోజవర్గ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటియుసి) అనుబంధం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, ఏ. ఐ.టి. యు. సి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం,వైసిపి ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు లోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించి వాడుకున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం గూడూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మీరా భాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, సునీల్, వెంకటయ్య, మస్తాన్, రవీంద్ర, దస్తాగిరి, జిలానీ, బాల, పురుషోత్తం, మణి, వెంకటేష్, కరిముల్లా, మా భాషా, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి : ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని విమర్శించే అర్హత వైసిపి నాయకులకు లేదని కక్ష సాధింపు చర్యలు కూటమి ప్రభుత్వంలో ఉండవని వైసీపీ ప్రభుత్వం లోనే అక్రమ కేసులు పెట్టడం అరెస్టులు చేయడం జరిగిందని అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో ఆదివారం వైసిపి నాయకులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు విలేకరుల సమావేశం నిర్వహించి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. మేము ఎక్కడ ఎవరి మీద అక్రమ కేసులు పెట్టలేదని గత వైసిపి ప్రభుత్వంలో పనిచేసిన పోలీస్ అధికారులు ఇప్పటికీ పని చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, నల్లపురెడ్డి వినోద్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య దువ్వూరు రాశేఖర్‌రెడ్డి వెంకటేశ్వరరాజు, మట్టం శ్రావణిరెడ్డి, గుండాల లీలావతి, దశరథ రామిరెడ్డి, రహీం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

33 చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చికిత్స చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 21 లక్షల 38 వేల 606 రూపాయులు, 33 చెక్కులను గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ లబ్ధిదారులకు అందజేసారు. అదేవిధంగా ఇటీవల నేపాల్‌లో చిక్కుకొని ఉన్నటువంటి మా రాష్ట్ర యాత్రికులను ఐటి పర్సనల్ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు సర్వతో క్షేమంగా తీసుకురావడం సంతోష్ దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చండి మహా ప్రభో

పెళ్లకూరు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మండలంలోని పునబాక పంచాయతీ నందుగల రైస్‌మిల్ గిరిజన కాలనీ నందు గత పది రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు నూతనంగా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడం కోసం త్రవ్విన గుంతల కారణంగా తాగునీటి పైపులు పగిలిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఇది జరిగి 10 రోజులు గడుస్తున్న సంబంధిత అధికారులు ఎవరూ ఈ సమస్యను పట్టించుకోక పోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మా ఈ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మారిషస్ ప్రధానమంత్రికి...గురూజీ ఆశీస్సులు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మారిషస్ ప్రధాన మంత్రి నవీన్‌చంద్ర రామ్‌గోలం దంపతులను శ్రీబ్రహ్మశ్రీ గురువానంద గురూజీ ఆశీర్వదించారు. సోమవారం మారిషస్ ప్రదాని తిరుపతి సమీపంలో వెలసియున్న సిద్ధేశ్వర ఆశ్రమానికి చేరుకున్నారు. ఆశ్రమానికి విచ్చేసిన ప్రధానికి రాష్ట్ర దేవాధాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, ఎంఎల్ఏ పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి దుశ్శాలువతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ మారిషస్‌కు నవీంద్రరామ్‌గోలం నాలుగవ సారి ప్రదానిగా ఎంపికయ్యారని కొనియాడారు. గత ఏడాది సెప్టెంబర్ 15న మారిషస్‌లో కలసినపుప్పుడు నవంబర్ 13లోపు ప్రధానమంత్రి అవుతానని ఆశీర్వదించారని అన్నారు. గురూజీ ఆశీర్వాదంతో తాను ప్రధానమంత్రి అయినట్లు తెలిపారు. ఇందుకు కృతజ్ఞతగా ఆశ్రమానికి విచ్చేసి గురూజీ ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు.

యస్వీయూలో యువతరంగ్ సన్నాహకాలు

తిరుపతి విద్య,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో జరగబోయే యువతరంగ్ 2025 పోస్టర్‌ను యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, ఆంధ్రప్రదేశ్ శాప్ ఛైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డైరెక్టర్ ఆచార్య మురళీధర్, ప్రిన్సిపాలల్స్ సోమవారం ఉపకులపతి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉపకులపతి మాట్లాడుతూ అక్టోబర్ 16,17,18 తేదీలో సర్వీసు పరిధిలోని అన్ని డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థులకు అంతర్ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలు నిర్వహించబోతు న్నామని, వక్తృత్వం, సంగీతం, నృత్యం,థియేటర్ ఆర్ట్స్ వంటి 10 విభాగాల్లో ప్రతిభావంతులను ఎంపిక చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, విశ్వవిద్యాలయం కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్యులు పద్మావతి, వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు,సుబ్బారావు, వరదరాజన్, విజయసారథి రెడ్డి,శంకర్ గణేష్, కల్చరల్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన రవాణా సేవలు అందించడమే లక్ష్యం : ఆర్టీసీ వైస్ ఛైర్మన్

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : ప్రజలకు ఎపిఎస్‌ఆర్టీసీ ద్వారా మెరుగైన రవాణా సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం ఆయన కుప్పం డిపోను సందర్శించారు. ఈసందర్భంగా డిపోలో కార్యకలాపాలు, బస్సుల నిర్వహణ, ప్రయాణీకులు, సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం సక్సెస్ అయిందన్నారు. ఈపథకం ద్వారా మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత ప్రయాణాలు చేస్తున్నారన్నారు. సిఎం ఆదేశాల మేరకు కుప్పం ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆధునిక రీతిలో అన్ని హంగులతో నిర్మిస్తామన్నారు. కుప్పంలో డిపోలో ఉన్న లోటుపాట్లను పరిష్కరించాలని, సమయపాలన, బస్సుల శుభ్రత, ప్రయాణీకుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిపో మేనేజర్ టికెస్వామిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎడిఎం దినేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం

డక్కిలి,సెప్టెంబరు15 ప్రభాతవార్త: పశు సంరక్షణ కోసం రైతులు వర్షాకాలంలో రానున్న వ్యాధుల పట్ల తగు జాత్రలు తీసుకోవాలని వెంకటగిరి పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకులు శ్రీహరి తెలిపారు. మండలంలోని దేవుడు వెల్లంపల్లి,నాగవోలు గ్రామాలలో సోమవారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు, మాదా వాయపాళెం సింగిల్‌విడో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఎంపీపీ గోను రాజశేఖర్‌ల సమక్షంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వతేది నుంచి అక్టోబరు 10వతేది వరకు అన్నీ గ్రామాలలో గాలి కుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పశువైద్య వైద్యులు ఎస్.కిషోర్, రాధాలక్ష్మీ,పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచెంగాళమ్మ శరన్నవరాత్రులకు ఆహ్వానం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్న శ్రీచెంగాళమ్మ శరన్నవ రాత్రులకు విచ్చేసి అమ్మణ్ణి ఆశీస్సులు పొందాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డికి సోమవారం ఆహ్వానం పలికారు. దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి, వేదపండితులు కలిసి ఆశీర్వచనాలు అందజేసి శరన్నవరాత్రులకు రావాలని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.

మాబాషాకు అంబేడ్కర్ సేవారత్న పురస్కారం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేటకు చెందిన మెగాస్టార్ చిరంజీవి సేవాసంఘం ప్రతినిధి మాబాషాకు అంబేడ్కర్ జాతీయ సేవారత్న పురస్కారం సోమవారం అందుకున్నారు. విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రం గ్రంథాలయంలో మహల్ మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంధ సేవాసంస్థ 3వ వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి అంబేడ్కర్ జాతీయ సేవారత్న పురస్కారాన్ని అందజేశారు.

సాగుభూమిని ఇప్పించండి

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: కొత్తపల్లి గ్రామంలో సర్వేనంబర్ 6లో ఉన్న భూమిని సాగు చేసేందుకు తమకు ఇప్పించాలని 70 మంది గిరిజన కుటుంబాల వారు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో 180 ఎకరాలు ఉన్న భూమిని సిజెఎఫ్ఎస్ కింద బిసిలకు అసైన్‌మెంట్ పట్టాల కింద ఇచ్చి ఉన్నారని తెలిపారు. ఆర్డీఓ తమ సమస్యను పరిశీలించి భూమిలేని తమకు న్యాయం చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంఓ సిపిఐ పార్టీకి చెందిన ఎం.పార్థసారథి, ఎ.ఆనంద్‌బాబు, లక్ష్మి, బాలయ్య, వెంకటరావులు పాల్గొన్నారు.

మాంబట్టు సెజ్‌లోని ఇన్‌ఫిలుం కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మాంబట్టు సెజ్‌లోని ఇన్‌ఫిలుం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాక్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు వేతనాల విషయమై కంపెనీ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. జూలై, ఆగస్టు నెల వేతనాలు కంపెనీ వారు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సిఐటియు నాయకులు లక్ష్మయ్య తదితరులు కంపెనీకి వెళ్లి చర్చలు జరిపారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని కంపెనీ యాజమాన్యాన్ని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని చెప్పారు.

రిజిస్ట్రేషన్‌లో ఓటిపి విధాన్ని రద్దు చేయాలి

వెంకటగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆధార్ కార్డు, సెల్ఫోన్ ఓటిపిల విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే పద్ధతి వల్ల ఇబ్బందులు కలుగుతున్నట్లు దస్తావేజుల లేఖకులు వాపోయారు. ఓటిపి విధానం వల్ల కక్ష దారులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఓటిపి విధానాన్ని రద్దు చేయాలని సబ్ రిజిస్టర్ భాషకు దస్తావేజుల లేఖకులు విజ్ఞప్తి చేశారు. దస్తావేజుల లేఖకులు సురేష్, సాయి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కైవల్యా నదిని కబ్జా చేస్తున్నారు!

వెంకటగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పట్టణంలోని అమ్మవారిపేట చెరువు, కైవల్యా నదిని పలువురు కబ్జా చేస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ ఆర్టిఐ విభాగం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన అమ్మవారిపేట చెరువు కైవల్యాన్ని నదిని పరిశీలించారు. అమ్మవారిపేట చెరువును కొద్దికొద్దిగా కబ్జా చేశారని తెలిపారు. ఈ చెరువుకు ఆయకట్టు లేనందున పార్కుగా మార్చాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు విజ్ఞప్తి చేశారు సూచించారు. పట్టణంలో లింకు రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం : ఎంపీడీవో

బాలాయపల్లి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త బాలాయపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీ ఉదయం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జరుగుతుందని ఎంపీడీవో డీజే వినిల్ కుమార్ తెలిపారు. ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

నేడు వెంకటగిరి మండల పరిషత్ సమావేశం

వెంకటగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: వెంకటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తనుజా రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు.

రైఫిల్ షూట్ స్టేట్ మీట్‌కి విద్యార్థులు ఎంపిక

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఎస్‌జిఎఫ్ఐ స్పోర్ట్స్‌లో భాగంగా జిల్లా స్థాయిలో గూడూరు పట్టణంలోని ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ నందు జరిగిన రైఫిల్ షూటింగ్ పోటీలలో అండర్ 14 విభాగంలో శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తేజస్వి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, ఈప్సిత శ్రీ జిల్లా స్థాయిలో మూడవ స్థానం సాధించి స్టేట్ మీట్‌కి ఎంపిక అయినట్లు కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి తెలిపారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : పశువులకు వర్షాకాలంలో గాలి కుంటు వ్యాధి సోకే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఆ వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నారని పశువైద్యాధికారులు ప్రాంతీయ పశు వైద్యశాల డా. సురేష్ పేర్కొన్నారు. సోమవారం మండలం అర్బన్ 1వ వార్డులో, నెల్లటూరు, కొండాగుంట, తిప్పవరపాడులో 435 పవువులకు టీకాలు వేసారు. అనంతరం గాలి కుంటు వ్యాధి పై రైతులకు అవగాహన కల్పించారు.

హెచ్.ఐ.వి పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ ఆసుపత్రి, బాలాజీ జూనియర్ కాలేజీ లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ సుహాసిని మాట్లాడుతూ యువత హెచ్.ఐ.వి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యామెల్ సిబ్బంది చాన్ భాష, ఉమా, సురేష్, భారతి, సునీత, మాధురి, ఇందు, పాల్గొన్నారు.

దారిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టండి

గూడూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని శ్రీ సత్య సాయి మందిరం దారిని ఆక్రమించుకున్న ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ అండ్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 36 ఏళ్లుగా గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధిలోని 13/22 డోర్ నెంబర్‌గల మందిరంలో ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. 2003వ సంవత్సరంలో మందిరంకు ఉత్తర వైపు ఉన్న 20.4 అంకణములు స్థలము రిజిస్టర్ పత్రం ద్వారా పొంది ఉన్నాము. ఉత్తర వైపున ఉన్న ఉమ్మడి దారినీ బండి వెంకట శ్రీధర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆక్రమించి మందిరం నిర్మాణ పనులకు ఆటంకం కల్గిస్తున్నారన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని తహశీల్దార్‌కి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. వెంకట సురేష్, ఎస్ఎల్ఎన్ స్వామి, దాము ప్రతాప్, ఆనంద్, మల్లికార్జునరావు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పలువురు మహిళా ప్రతినిధులు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ మహిళా సాధికారిక సదస్సు మహిళాభ్యున్నతికి ఎంతో దోహదపడిందని పలువురు మహిళా ప్రతినిధులు అభిప్రా యపడ్డారు. సోమవారం ఉదయం నుంచి మహిళా ప్రతినిధులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి అఖండ స్వాగతాన్ని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఏర్పాట్లు చేసారు. సోమ వారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనాలకు వచ్చిన వారికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, రిషితారెడ్డి, బొజ్జల బృందమ్మ, ఆలయ ఇఓ బాపిరెడ్డి వారి సహచరులు పర్యవేక్షించారు.

మహిళాభ్యున్నతికి రెండు కీలక తీర్మానాలు చేసాం:

శ్రీకాళహస్తికి వచ్చిన తిరుపతి మహిళా సాధికారిక సదస్సులో పాల్గొన్న మహిళా ప్రతినిధులు కమిటి సభ్యురాలు జనసేన ఎంఎల్ఏ లోకం మాధవి మీడియాతో మాట్లాడుతూ సదస్సులో రెండు ప్రధాన తీర్మానాలు చేసామన్నారు. ఇందులో ఆర్థిక స్వాలంబన సాధనే లక్ష్యంగా కృషి చేయటానికి అవసరమైన చర్చ జరిగిందన్నారు. దేశంలో మొట్టమొదాటి సారిగా మహిళా ప్రజా ప్రతినిధులు మహిళా అభ్యున్నతిపై జాతీయ సదస్సు నిర్వహించటం తిరుపతికి ఆంధ్ర రాష్ట్రానికి గర్వకారణమన్నారు